ఆరు పథకాలపై ఇంటింటి సర్వే



దరఖాస్తుదారుల వద్ద వివరాలు సేకరిస్తున్న బిల్ కలెక్టర్ రాజశేఖర్

సుభాష్‌నగర్: ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు పథకాల దరఖాస్తుదారుల ఇంటింటి సర్వేను జీడిమెట్ల డివిజన్ యాదిరెడ్డి బండలో శుక్రవారం చేపట్టారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా బిల్ కలెక్టర్ రాజశేఖర్ ఆరు పథకాల కోసం దరఖాస్తు చేసిన వారి ఇంటికి వెళ్లి ఆధార్ కార్డును పరిశీలించారు. దరఖాస్తుదారులకు సొంత ఇల్లు ఉందా.. లేక అద్దె ఇంట్లో ఉంటున్నారా..? సొంత ఇల్లు ఉన్నవారికి పట్టా ఉందా, లేదా అనే వివరాలు సేకరించారు. ఈ వివరాలను ప్రత్యేక వెబ్‌సైట్‌లో పొందుపరుస్తున్నారు.


రిజిస్ట్రేషన్ కోసం '108' వాహనాలు



మేడ్చల్ ఆర్టీవో కార్యాలయం వద్ద రిజిస్ట్రేషన్ నిమిత్తం 108 వాహనాలు

సుభాష్‌నగర్: ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా వెయ్యి 108 కొత్త వాహనాలు మంజూరు చేయగా వారం రోజులుగా రిజిస్ట్రేషన్ నిమిత్తం మేడ్చల్ ఆర్టీవో కార్యాలయానికి తీసుకువస్తున్నారు. ప్రధాన కార్యాలయం మేడ్చల్ మండలంలో ఉండగా ప్రస్తుతం ఇక్కడ 600 వాహనాలు ఉంచారు. పూణే నుంచి విడతల వారీగా వస్తున్న వాహనాలను ఒక్కో రోజు ఒక్కో జిల్లాకు చెందిన వాహనాలను మేడ్చల్ ఆర్టీవో కార్యాలయానికి తీసుకువచ్చి రిజిస్ట్రేషన్ చేయించి తీసుకెళ్తున్నారు.

17 నుంచి చిత్తారమ్మ ఆలయ స్వర్ణోత్సవాలు



ఆలయంలో కొలువైన చిత్తారమ్మదేవి

కుత్బుల్లాపూర్: గాజులరామారం చిత్తారమ్మదేవి స్వర్ణోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కూన అంతయ్యగౌడ్ తెలిపారు. ఉత్సవ ఏర్పాట్ల వివరాలను శుక్రవారం ఆయన విలేకరులకు వెల్లడించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా వచ్చేనెల 17వ తేదీన ఉదయం 8 గంటలకు గణపతి పూజ, పంచగవ్యప్రాశన, దీక్షాధారణ, మంటపరాధన, అగ్నిప్రతిష్ఠ, 18న అవాహియ దేవతా పూజలు, చండీహోమం, పూర్ణాహుతి, బలి ప్రధానం, సాయంత్రం 5 గంటలకు పూలఘటంపై అమ్మవారి ఉత్సవ విగ్రహం ఊరేగింపు, 19వ తేదీన ఉదయం 3 గంటలకు అభిషేకం, 4 గంటలకు అమ్మవారి విజయ దర్శనం, ఒడిబియ్యం సమర్పణ, ప్రత్యేక పూజలు, 11 గంటలకు బోనాల తీయుట, మధ్యాహ్నం 3 గంటలకు ఊరేగింపు, 20వ తేదీ ఉదయం 11 గంటలకు అమ్మవారి భవిష్యవాణి, 21, 22, 23, 24 తేదీల్లో కుంకుమార్చనలు, 25వ తేదీ ఉదయం 11 గంటలకు ఆలయ ప్రాంగణంలో అన్నసంతర్పణ ఉంటుందని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ కోరింది.

మిద్దెపై నందనవనం

130 గజాల ఇంటిపై అలరిస్తున్న మిద్దెతోట

పండ్లు, కూరగాయలు, ఆకుకూరలతో పాటు ఆకట్టుకుంటున్న పూలు

రసాయనాలు వాడకుండా పండిస్తూ..

స్థానికులకు ఆదర్శంగా నిలుస్తున్న దంపతులు

నగర శివార్లు సైతం కాంక్రీట్ జంగిల్స్‌గా మారుతున్నాయి. ఇంటి చుట్టూ కాసింత స్థలం కరువైంది. పూలు, పండ్ల మొక్కలు నాటుకునేందుకు ఎలాంటి అనుకూల పరిస్థితి లేకుండా పోయింది. మార్కెట్లో దొరుకుతున్న కూరగాయలపై ఇష్టానుసారంగా పురుగుల చల్లుతున్నారు. దీంతో చాలామంది ఇంటిపైన ఉన్న స్థలంలో మిద్దె తోట ఏర్పాటు చేసుకుంటున్నారు. ఎలాంటి రసాయనాలు వాడని కూరగాయలను పండించుకొని ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు. గతంలో ఇలాంటి వాటిపై ఆసక్తి తక్కువ ఉన్నా.. ఇప్పుడు అధిక సంఖ్యలో ఇంటి డాబాపై కూరగాయలు పండిస్తూ ఎప్పటికప్పుడు ఫ్రెష్‌గా తింటున్నారు. దానికి తోడు డాబాపైకి వెళ్తే పచ్చదనంతో ఎంతో ఆహ్లాదకరంగా ఉంటోంది.

– సుభాష్‌నగర్



చెట్టుకు కాసిన స్ట్రాబెర్రీ



ఇంటిపై పెంచుతున్న పండ్లతోట, పూల మొక్కలు, ఆకు కూరలు

నగరంలో కేవలం 60 గజాలు ఉంటే చాలు అద్దెల కోసం అంతస్తుపై అంతస్తు వేసి పచ్చదనం కనుమరుగు చేస్తున్న తరుణంలో సూరారం డివిజన్ శ్రీరామ్‌నగర్‌కు చెందిన ఎంవైఆర్ నాయుడు, సుసి దంపతులు కేవలం 130 గజాల ఇంటిపై 60కి పైగా పండ్ల తోటతో పాటు కూరగాయలు సాగు చేస్తున్నారు. ఆ దంపతులు ప్రతిరోజూ రెండు గంటల పాటు శ్రమించి ఇంటిని నందనవనంగా తీర్చిదిద్దుతున్నారు.

130 గజాలు.. 60 రకాలు..

మల్బరీ, జామ, మామిడి(4రకాలు), నారింజ, నిమ్మకాయ(2 రకాలు), స్టార్ ఫ్రూట్, డ్రాగన్ ఫ్రూట్, అరటి, అవకాడో, పెద్దఉసిరి, చిన్నఉసిరి, దానిమ్మ, వాటర్ ఆపిల్(2రకాలు), సపోటా, బల్బెరి, మిరాకిల్ ఫ్రూట్, మునగ, లెమన్‌గ్రాస్, మందార, టమాటా, వంకాయ, ఇతర కూరగాయలు, కరివేపాకు, మెంతి తదితర ఆకుకూరలు పండిస్తున్నారు. దాంతో పాటు ఆహ్లాదం కోసం కొన్ని రకాల పూల మొక్కలు పెంచుతున్నారు.



అంజీర్ పండ్లు

ఇంట్లో వేస్టేజీతో వర్మీ కంపోస్ట్ ఎరువు

ఇంట్లోని టీ పొడి నుంచి మొదలుకొని, కూరగాయల వేస్టేజి, ఆకులు, చెత్తతో వర్మి కంపోస్ట్ ఎరువును తయారు చేసి ఎలాంటి రసాయనాలు ఉపయోగించకుండా మిద్దెపై పెంచుతున్న మొక్కలకు ఉపయోగిస్తున్నారు.

ప్లాస్టిక్ డబ్బాలు, మట్టి పాత్రల్లో..



మేము ఇల్లు కట్టిన సమయంలో ఇంటి కోసం తెచ్చిన పెయింటింగ్, ఇతర ముడిసరుకు డబ్బులను పడేయకుండా వాటిని మొక్కలు, కూరగాయల సాగుకు ఉపయోగిస్తున్నాం. ఇంట్లోని చెత్తతో వర్మి కంపోస్ట్ ఎరువు తయారు చేస్తూ ప్రతిరోజూ మొక్కల పెంపకం బాధ్యతగా తీసుకున్నాం. కేవలం ఆరు నెలల్లో అనుకున్నది సాధించాం. మా ఇంటిని చిన్నపాటి అడవిగా మార్చడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నాం.

– ఎం.వై.ఆర్ నాయుడు, శ్రీరామ్‌నగర్

ఓసారి లుక్కేయాల్సిందే..



బంధువులు, ఇంటి పక్కన వాళ్లు మా ఇంటికి వచ్చారంటే దాబాపైకి ఓసారి వెళ్లి లుక్కు వేయాల్సిందే అంటారు. ఇంటిపై పెంచుతున్న పండ్ల తోటలు కూరగాయల సాగు కోసం వారికి అరగంట కేటాయించి చెప్పాల్సిందే. మొదట్లో మేము ప్రారంభించినప్పుడు ఎవరూ అంతగా పట్టించుకోలేదు. ఇప్పుడు చాలామంది మమ్మల్ని ఆదర్శంగా తీసుకొని ఇంటిపై మొక్కలు సాగు చేస్తున్నారు. చాలా సంతోషంగా ఉంది.

– సుసి, శ్రీరామ్‌నగర్

పునరుద్ధరణీయ ఇంధన వనరులతో పరిశ్రమల మనుగడ

తెలంగాణ రెడ్ కో మేనేజింగ్ డైరెక్టర్ వావిళ్ల అనీల



పారిశ్రామికవేత్తలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న వావిళ్ల అనీల

రంగారెడ్డినగర్: పునరుద్ధరణీయ ఇంధన వనరులతోనే భవిష్యత్‌లో పరిశ్రమలు మనుగడ సాగిస్తాయని తెలంగాణ రెడ్ కో మేనేజింగ్ డైరెక్టర్ వావిళ్ల అనీల అన్నారు. రంగారెడ్డినగర్ డివిజన్ గాంధీనగర్‌లోని స్మార్ట్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం జాతీయ విద్యుత్ సహజ వనరుల పరిరక్షణ వారోత్సవాలు నిర్వహించారు. గాంధీనగర్ ఐలా పారిశ్రామికవేత్తల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన అనీల మాట్లాడుతూ పారిశ్రామికవేత్తలు నాణ్యమైన విద్యుత్ పరికరాలనే వాడాలని, ప్రతి పారిశ్రామికవేత్త పునరుద్ధరణీయ ఇంధన వనరుల ఆధారిత విద్యుత్ వాడకాన్ని చేపడితే విద్యుత్ ఆదా అవుతుందన్నారు. పునరుద్ధరణీయ ఇంధన వనరుల ఆధారితతో కొనసాగే పరిశ్రమల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని, ప్రభుత్వపరంగా అనేక రాయితీలను పొందే ఆస్కారం ఉంటుందని స్పష్టం చేశారు. అనంతరం పలువురు పారిశ్రామికవేత్తలు అనీలకు పుష్పగుచ్ఛాలు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ రెడ్ కో జనరల్ మేనేజర్ వరప్రసాద్, డిప్యూటీ డైరెక్టర్(నేషనల్ ప్రొడక్టివిటీ కౌన్సిల్) పీఆర్.రాజ్ కమల్, డిప్యూటీ జనరల్ మేనేజర్ రమణ, ప్రాజెక్టు డైరెక్టర్ రాధిక, ఐలా చైర్మన్ పీవీ రాజం, పూర్వ చైర్మన్ ఆర్.శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, గాంధీనగర్ ఇండస్ట్రీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పైడిపల్లి స్వామిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్



ధ్వంసం చేసిన వాటర్ ట్యాంక్‌ను పరిశీలిస్తున్న కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత కూన శ్రీశైలంగౌడ్ అధికారులకు స్పష్టం చేశారు. కొంపల్లి ప్రభుత్వ పాఠశాల ఆవరణలో నిర్మించిన వాటర్ ట్యాంకులను ఎటువంటి సమాచారం లేకుండా కూల్చివేయడంపై స్థానిక నాయకుల సూచన మేరకు శుక్రవారం స్కూల్‌ను సందర్శించారు. ఇప్పటికే ఈ ఘటనపై కొంపల్లి కాంగ్రెస్ నేతలు జిమ్మీ దేవేందర్, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు బైరి ప్రశాంత్‌గౌడ్ జలమండలి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. బాధ్యులపై చర్యలు తీసుకోకుంటే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. మాజీ ఉపసర్పంచ్ గోపాల్‌రెడ్డి, ఆదిరెడ్డి మోహన్‌రెడ్డి, మాజీ వార్డు సభ్యులు కావలి గోపాల్, పూర్ణచంద్రరావు శ్రీనివాస్‌గౌడ్, నవీన్ ముదిరాజ్ ఉన్నారు.

రూ.లక్షల ప్రజాధనం వృథా..

కొంపల్లి మున్సిపల్ నిధులతో 2017లో రూ.28 లక్షలు వెచ్చించి రెండు సంపులను గ్రామస్తులకు తాగునీటిని అందించేందుకు ఏర్పాటు చేశారు. గోదావరి జలాలు ఈ సంపులో నింపి సమీప ప్రాంతంలో ఉన్న కాలనీలు కొంపల్లి, దూలపల్లి ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. ఇంతలో ఏమైందో ఏమో..! 17వ తేదీన మంగళవారం ఓ కాంట్రాక్టర్ వచ్చి వీటిని ధ్వంసం చేయడంపై కాంగ్రెస్ నేతలు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి ఫిర్యాదు చేశారు. వెంటనే అప్రమత్తమైన జలమండలి అధికారులు ధ్వంసం అయిన సంపులను పరిశీలించి జలమండలి డీజీఎం త్రినాథ్‌రావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంతేగాకుండా విద్యార్థులు ప్రతిరోజూ ఆటలు ఆడుకునే ఓపెన్ జిమ్ పరికరాలు సైతం తొలగించడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

రోడ్డు, డ్రైనేజీ సమస్యలపై కమిషనర్‌కు వినతి



నిజాంపేట్: శిథిలావస్థకు చేరుకున్న డ్రైనేజీ, రోడ్డు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మేడ్చల్ జిల్లా యూత్ కాంగ్రెస్ సెక్రటరీ ఎర్రోళ్ల విష్ణు ఆధ్వర్యంలో నిజాంపేట్ కమిషనర్ సాబేర్ అలీకి శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలోని 16వ డివిజన్ రోడ్డు నంబర్-5లో డ్రైనేజీ లైన్ ధ్వంసం కావడంతో తరచూ రోడ్డుపై మురుగు పారుతోందని, అదేవిధంగా ధ్వంసమైన రోడ్డుతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అధికారులు వెంటనే నిధులు మంజూరు చేసి కొత్త పైపులైన్, సీసీ రోడ్లను వేయాలని కోరారు. కమిషనర్ సానుకూలంగా స్పందించారు. వడ్డెర సంఘం నాయకులు చిన్న వెంకటయ్య, చందు, బాలు, వెంకటేష్, రాము, బాలు తదితరులు ఉన్నారు.

మహిళా శక్తి క్యాంటీన్లతో ఆర్థిక భరోసా



మహిళా శక్తి క్యాంటిన్‌ను ప్రారంభిస్తున్న డీసీ మల్లయ్య

జగద్గిరిగుట్ట: మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు 'మహిళా శక్తి క్యాంటీన్లు' ఎంతగానో ఉపయోగపడతాయని కార్పొరేటర్ జగన్ అన్నారు. జగద్గిరిగుట్ట వార్డు కార్యాలయం సమీపంలో మహిళా శక్తి క్యాంటిన్‌ను గాజులరామారం సర్కిల్ డీసీ మల్లయ్యతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. మధ్యతరగతి కుటుంబాలు ఎక్కువగా ఉండే జగద్గిరిగుట్టలో ఈ క్యాంటిన్ ప్రారంభించడం సంతోషమని అన్నారు. గాజులరామారం సర్కిల్ డీసీ మల్లయ్య మాట్లాడుతూ ఇప్పటికే జంట సర్కిళ్లలో నాలుగు క్యాంటిన్లను(గాజులరామారం సర్కిల్ మండల కార్యాలయం వద్ద, సర్కిల్ కార్యాలయం, జగద్గిరిగుట్ట వార్డు కార్యాలయంలో అలాగే కుత్బుల్లాపూర్ సర్కిల్‌లో సూరారం) ప్రారంభమైనట్లు, అవి విజయవంతంగా నడుస్తుండటంతో ఇకముందు కొత్తగా క్యాంటిన్‌లను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అధికారులు, ఆర్‌జీకే సంక్షేమ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత



పూజల్లో కొలను గోపాల్‌రెడ్డి

నిజాంపేట్: వేంకటేశ్వర స్వామి కృప అందరిపై ఉండాలని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కొలను గోపాల్‌రెడ్డి అన్నారు. బాచుపల్లిలోని హిల్ కౌంటీలో తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కాసాని వీరేశ్ ముదిరాజ్ ఇంట్లో శుక్రవారం నిర్వహించిన శ్రీవేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజాలు నిర్వహించారు. ప్రజలు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొలను గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనతో కుటుంబాల్లో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. కార్పొరేటర్లు కాసాని సుధకార్, ఆగం పాండు తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా వెంటనే రాజీనామా చేయాలి



గండిమైసమ్మ చౌరస్తాలో హోంమంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం చేసిన సీఐటీయూ నాయకులు

కుత్బుల్లాపూర్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై హోంమంత్రి అమిత్‌షా వ్యాఖ్యలను నిరసిస్తూ శుక్రవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా వామపక్షాలు, అనుబంధ సంస్థల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాతను అవమాన పరిచేలా మాట్లాడిన హోంమంత్రి తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

- సీఐటీయూ దుండిగల్ మండల కన్వీనర్ బొడిగె లింగస్వామి ఆధ్వర్యంలో గండిమైసమ్మ చౌరస్తాలో కేంద్ర హోంమంత్రి అమీత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. నాయకులు సత్యం, లక్ష్మయ్య, శ్రీను, దుర్గేష్, రాజు, స్వామి తదితరులు పాల్గొన్నారు.
- బాచుపల్లి సీపీఐ మండల కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ ఆధ్వర్యంలో దళిత సంఘాల నాయకులు నిజాంపేట్ ఎస్సీ కాలనీలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు.



నిజాంపేట్ ఎస్సీ కాలనీలో నిరసన తెలుపుతున్న దళిత సంఘాల నాయకులు

నాలాలో వ్యక్తి మృతదేహం లభ్యం



సుభాష్‌నగర్: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూరారం వెంకట్రామ్‌నగర్‌లోని ఓ హాస్టల్ సమీపంలో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉందని స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించగా అతడి ప్యాంట్ జేబులో డ్రైవింగ్ లైసెన్స్ లభించింది. అందులో అతడి పేరు లింగయ్య అని, ఇంటి నంబరు 8-47/1, గాజులరామారం సంజయ్‌గాంధీనగర్ అని ఉందని పోలీసులు తెలిపారు. ఎవరైనా మృతుడి సంబంధీకులు ఉంటే స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

మద్యం మత్తులో నాలాలో పడి..



కుత్బుల్లాపూర్: మద్యం మత్తులో నాలాలో పడి యువకుడు మృతి చెందిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జీడిమెట్ల జయరామ్‌నగర్ కాలనీకి చెందిన కుమ్మరి రాజు(27) గ్యాస్ కంపెనీలో కూలీ పనులు చేసుకుంటూ వచ్చిన డబ్బులతో మద్యం తాగేవాడు. ఈ నెల 19న రాత్రి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి చేరుకోలేదు. శుక్రవారం కుత్బుల్లాపూర్ గ్రామానికి వెళ్లే దారిలో ఉన్న చిన్న నాలాలో పడి ఉండటాన్ని స్థానికులు గమనించి మృతుడి సోదరుడు సంతోష్‌కు ఫోన్ చేసి తెలిపారు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జైలుకెళ్లి వచ్చినా చోరీలు మానలేదు

- భరత్‌ను అరెస్టు చేసిన జగద్గిరిగుట్ట పోలీసులు
- 12.7 తులాల బంగారు ఆభరణాలు, రూ.7 లక్షలు స్వాధీనం

జగద్గిరిగుట్ట: పలు చోరీ కేసుల్లో జైలుకు వెళ్లి వచ్చాడు.. అయినా తీరుమార్చుకోలేదు. మళ్లీ మళ్లీ చోరీలు చేస్తూనే ఉన్నాడు. తన బంధువు ఇంట్లోనే చోరీ చేసి పోలీసులకు చిక్కాడు. దొంగను పట్టుకున్న జగద్గిరిగుట్ట పోలీసులు వివరాలను వెల్లడించారు. ఆల్విన్‌కాలనీలో నివాసం ఉండే జంగం పరమేష్ ఈ నెల 15న తన నానమ్మ వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి జనగామకు వెళ్లాడు. తిరిగి 18వ తేదీ రాత్రి ఇంటికి వచ్చాడు. కిటికీ అద్దాలు పగిలి ఉండటం, మెయిన్ డోర్‌ను తెరిచి ఉండటంతో లోనికి వెళ్లి చూడగా బీరువాలోని బంగారు ఆభరణాలను కనిపించకపోవడంతో పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తులో భాగంగా నడగొట్టి భరత్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడు. అతడి వద్ద నుంచి 12.7 తులాల బంగారు ఆభరణాలు, సుమారు రూ.7 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో బాలానగర్ ఏసీపీ జి.హనుమంతరావు శుక్రవారం నిందితుడి వివరాలను వెల్లడించారు. నడగొట్టి భరత్ చిన్నతనంలోనే తల్లిదండ్రులు చనిపోయారు. అనాథాశ్రమంలో 10వ తరగతి పూర్తి చేసి, హెయిర్ సెలూన్లలో పనిచేస్తున్న సమయంలో చెడు సావాసాలకు అలవాటు పడ్డాడు. సులువుగా డబ్బుల సంపాదించడం కోసం చోరీల బాట పట్టాడు. 2020 నుంచి పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో చోరీలు చేసి జైలుకు వెళ్లి వచ్చాడు. అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఇన్‌స్పెక్టర్ సీఐ నర్సింహ, డీఐ అంజయ్య, పోలీస్ సిబ్బంది ఉన్నారు.




క్రిస్మస్ వేడుకలకు ఆహ్వానం



నిజాంపేట్: క్రిస్మస్ వేడుకలను సంతోషంగా జరుపుకోవాలని కాంగ్రెస్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. బాచుపల్లిలోని కార్యాలయంలో ఆయనను క్రిస్టియన్ మైనార్టీ ఇన్‌చార్జి కల్లోజి రవికుమార్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గవ్యాప్తంగా నిర్వహించే క్రిస్మస్ వేడుకలకు రావాల్సిందిగా కోరుతూ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా హన్మంతరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో క్రైస్తవులకు క్రిస్మస్ గిఫ్ట్‌లను అందజేస్తున్నామని, పండుగను సంతోషంగా జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, నిజాంపేట్ కార్పొరేషన్ అధ్యక్షుడు కొలన్ రాజశేఖర్‌రెడ్డి, పాస్టర్స్ సంఘం నియోజకవర్గ చైర్మన్ గోడి శేఖర్, పాస్టర్లు ఉన్నారు.

ఇంధన పొదుపుతోనే ప్రగతి



నిజాంపేట్: ఇంధన పొదుపు ప్రగతికి మలుపని, ఇంధన వనరులను ఉపయోగించుకుని పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని మేడ్చల్ జిల్లా టిజిరెడ్‌కో మేనేజర్ కె.పవన చందు అన్నారు. నిజాంపేట్‌లోని ఇందిరమ్మ కాలనీ ఫేజ్-3లో కాలనీలో తెలంగాణ ఇంధన వనరుల సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహజ ఇంధన వనరులైన సౌర, పవనశక్తి ఉపయోగించడం వలన సహజ వనరులైన బొగ్గు, గ్యాస్, పెట్రోల్‌ను భావితరాలకు కాపాడుకోవచ్చని అన్నారు. అదేవిధంగా పెట్రోల్, డీజిల్ వాహనాలు ఉపయోగించడం వలన వాతావరణ కాలుష్యం పెరుగుతుండటంతో ఎలక్ట్రికల్ వాహనాలను వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు. టిజిరెడ్‌కో అసిస్టెంట్ ఫీల్డ్ ఆఫీసర్ ఓ.ప్రకాశ్, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.